సాక్షి కామారెడ్డి
సోమవారం ₹ 18 ₹ సెప్టెంబర్ ₹ 2023

గరిష్టం/కనిష్టం
34.1 /21.2

వాతావరణం
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

న్యూస్‌రీల్

ఘనంగా విశ్వకర్మ జయంతి



కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, టీఎస్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తానా సమ్మేళనానికి ప్రత్యేక అతిథిగా పురం మంగ



బీబీపేట: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) నిర్వహించే అంతర్జాతీయ కవయిత్రుల సమ్మేళనంలో ప్రత్యేక అతిథిగా మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు పురం మంగ పాల్గొననున్నారు. తానా ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే నారి సాహిత్య భేరి అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనంలో ప్రత్యేక అతిథిగా పాల్గొనాలని ఆహ్వానం అందిందని మంగ తెలిపారు. 14 గంటల పాటు నిర్విరామంగా జరిగే సాహిత్య సమ్మేళనంలో సుమారు 15 దేశాలకు చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రులు పాల్గొంటారని పేర్కొన్నారు. మంగ వచన కవితల కవయిత్రిగా, పద్య రచయిత్రిగా ప్రఖ్యాతి పొందారు. ఆమెకు తానా సమ్మేళనంలో అవకాశం దక్కడంపై తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

బాన్సువాడ: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణేశ్ నవరాత్రులను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

మహాత్మా బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ



మద్నూర్: కొడిచిరలో ఆదివారం మహాత్మా బసవేశ్వరుడి విగ్రహాన్ని ఎంపీ బీబీ పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అందరు కలిసి బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం డోంగ్లీ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే హన్మంత్‌సింధేతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, వీరశైవ లింగాయత్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శం తెలంగాణ

- సీఎం కేసీఆర్ కృషితో అన్ని రంగాల్లో పురోభివృద్ధి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవాలు

సాక్షి, కామారెడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ జిల్లాలో 5.18 లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నామని, సాగు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమని పేర్కొన్నారు. రైతుబంధు ద్వారా జిల్లాలో 3.07 లక్షల మందికి రూ.2,515 కోట్ల పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 6,091 మంది రైతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున రైతు బీమా అందించి ఆదుకున్నామని తెలిపారు. 72,900 మంది రైతులకు సంబంధించి రూ.309 కోట్ల పంట రుణాన్ని మాఫీ చేశామన్నారు. మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖల ద్వారా చేపపిల్లలు, గొర్రెలను పంపిణీ చేసి కుల వృత్తులను ప్రోత్సహించామన్నారు. కాళేశ్వరంతో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకం, సిద్దాపూర్ రిజర్వాయర్ల నిర్మాణాలతో జిల్లా రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తున్నామన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇచ్చామని, సొంత జాగా ఉన్న వారికి రూ.3 లక్షలు అందించి ఇళ్లు కట్టుకునేందుకు ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.4 వేల పెన్షన్ అందిస్తున్న రాష్ట్రం కూడా తెలంగాణే అన్నారు. జిల్లాలో 37,077 మందికి కల్యాణలక్ష్మి, 6,065 మందికి షాదీముబారక్ అందించామన్నారు. జిల్లాలో ఐదువేల మంది గిరిజనులకు 11,365 ఎకరాల పోడు భూములను పంపిణీ చేశామన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి పేదలు ఉచితంగా మెడిసిన్ చదువుకునే అవకాశం కల్పించామన్నారు. రూ.235 కోట్లతో మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ కూడా వస్తుందన్నారు. బాన్సువాడ ఆస్పత్రి సేవలలో దేశంలోనే అగ్రగామిగా గుర్తింపు పొందిందన్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలను రూ.వందల కోట్లతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. జిల్లాలో 24 గంటల కరెంటు ఇస్తున్నామని, ఎక్కడైనా అంతరాయం కలిగినా వెంటనే మరమ్మతులు చేస్తున్నారని, అయినా కొన్ని రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధరణి పోర్టల్ తీసుకువచ్చి దళారీ వ్యవస్థకు మంగళం పాడామని, పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందంటూ స్పీకర్ అభినందించారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ కృషి అభినందనీయమన్నారు. అటెండర్ నుంచి కలెక్టర్ దాకా అందరు కష్టపడుతున్నారని, అందువల్లే మనం అన్నింటా అగ్రభాగాన నిలుస్తున్నామని పేర్కొన్నారు. సమైక్యత ఉత్సవాలలో భాగంగా జిల్లాలోని మాచారెడ్డి మండలం ఇసాయిపేట, బాన్సువాడలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థినులకు స్పీకర్ చేతులు మీదుగా ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న ఇసాయిపేట హైస్కూల్ విద్యార్థులు


బాన్సువాడ ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

'అధికారంకంటే అభివృద్ధి ముఖ్యం'


భిక్కనూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, ముదిరాజ్‌లు

భిక్కనూరు: అధికారంకన్నా అభివృద్ధి ముఖ్యమని, తాను అధికారంలో లేకున్నా ప్రజలకు అవసరమైన పనులను చేస్తున్నానని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన భిక్కనూరులో సొంత డబ్బులు రూ. 30 లక్షలతో ముదిరాజ్ సంఘ కల్యాణ మండపం నిర్మించారు. ఆదివారం కల్యాణ మండపాన్ని ప్రారంభించి మాట్లాడారు. తాను అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లో కుల సంఘాల భవనాలు, కల్యాణ మండపాలు, ఆలయాల నిర్మాణంతోపాటు పురాతన ఆలయాల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చిస్తున్నానని పేర్కొన్నారు. అధికారంలో ఎవరున్నా రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాల్సిందేనన్నారు. ఈ పనులు చేసి తామే అభివృద్ధి చేశామని చెప్పుకునే వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అంతకు ముందు ఆయనకు ముదిరాజ్ కులస్తులు టోల్ గేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి భిక్కనూరు పంచాయతీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీనుంచి ముదిరాజ్ కల్యాణ మండపం వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గెరుగంటి నర్సింలు, బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు ఉప్పరి రమేశ్, ముదిరాజ్ సదరు సంఘం అధ్యక్షుడు బండి రాములు, ప్రతినిధులు ఉప్పరి రాములు, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఎన్నికల బరిలో గల్ఫ్ బాధితులు!

- కామారెడ్డి అసెంబ్లీ స్థానంపై ఫోకస్ చేస్తున్న సంఘాలు
- గల్ఫ్ మృతుల భార్యలను పోటీలో నిలిపే యోచన
- వంద నామినేషన్లు వేయాలని ప్రణాళిక

సాక్షి, కామారెడ్డి: ఏళ్లుగా తమ సమస్యలపై పోరాడుతున్న గల్ఫ్ బాధితులు ఈసారి ఎన్నికల గోదాలో నిలవాలని యోచిస్తున్నారు. సర్కారుతో తాడోపేడో తేల్చుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బతుకుదెరువు కోసం లక్షలాది మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేక చాలామంది ఆర్థికంగా చితికిపోయారు. ఈ నేపథ్యంలో గల్ఫ్ బాధితులను ఆదుకోవాలంటూ ఆందోళనలూ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే గల్ఫ్ కార్మికులు సంఘాలుగా ఏర్పడి అనేక ఉద్యమాలు చేశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే గల్ఫ్ కష్టాలు తీరుతాయన్న భావనతో రాష్ట్ర సాధనోద్యమంలోనూ పాల్గొన్నారు. అయితే రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడచినా గల్ఫ్ బాధితుల కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో వారిలో ఆగ్రహం పెరుగుతోంది. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి ఆదుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని గల్ఫ్ జేఏసీ నిర్ణయించింది. అందులో భాగంగా ఎన్నికల బరిలో నిలవాలని, తద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్నారు.



రోడ్డునపడ్డ కుటుంబాలెన్నో..

కామారెడ్డి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో గల్ఫ్ దేశాలకు వలసవెళ్లారు. నాలుగైదు దశాబ్దాలుగా కామారెడ్డి ప్రాంతం నుంచి వలస వెళ్తున్నారు. నియోజకవర్గానికి చెందిన 30 వేల మందికిపైగా ఎడారి దేశాలలో ఉన్నారని అంచనా వేస్తున్నారు. అలాగే ఇక్కడ చాలా మంది గల్ఫ్ బాధితులు కూడా ఉన్నారు. గల్ఫ్‌కు వెళ్లిన వారిలో చాలా మంది అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొందరు ప్రమాదవశాత్తూ మరణించారు. వాళ్ల కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి.

కామారెడ్డి మీదే దృష్టి..

సీఎం కేసీఆర్ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని గల్ఫ్ జేఏసీ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గల్ఫ్ దేశాల్లో 1,800 మంది మరణించారని గల్ఫ్ కార్మిక సంఘాల జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. కనీసం చనిపోయిన కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కనీసం 100 మందిని బరిలో దింపాలని భావిస్తున్నారు. గల్ఫ్‌కు వెళ్లి అక్కడ చనిపోయిన వారి భార్యలను పోటీలో నిలపాలని యోచిస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన గల్ఫ్ కార్మికులంతా తలా కొంత జమ చేసి, నామినేషన్ రుసుము చెల్లిస్తారని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. గతంలో పసుపు రైతులు నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసినట్టే ఇక్కడ కూడా నామినేషన్లు వేస్తారని స్పష్టం చేస్తున్నారు.

హామీలు నెరవేర్చాలి

తెలంగాణ సాధనోద్యమం నుంచి రాష్ట్రం ఏర్పడేదాకా సీఎం కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు పలుమార్లు గల్ఫ్ కార్మికులు, గల్ఫ్ బాధితుల కోసం హామీలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రమొచ్చి తొమ్మిదేళ్లు గడిచినా ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా 1,800 మంది గల్ఫ్ కార్మికులు మృతి చెందారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల కోసం నిధి ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం దిగిరాకుంటే ఎన్నికల బరిలో నిలుస్తాం. కామారెడ్డినుంచి వంద మందిని బరిలో నిలుపుతాం.

– సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర నాయకుడు

మూడింతల అభివృద్ధి చేసిచూపిస్తా

- మంత్రి ప్రశాంత్ రెడ్డి
- భీమ్‌గల్ బస్‌డిపో పునఃప్రారంభం

భీమ్‌గల్ : ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాల్కొండను మూడింతలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. భీమ్‌గల్‌లో ఆర్టీసీ బస్ డిపోను ఆదివారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలోనే డిపోను మూసివేసి ఇప్పుడు వారే మళ్లీ తెరిపించాలని గోల చేయడం సిగ్గుచేటన్నారు. చిన్న మున్సిపాలిటీ అయినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ వేయించానన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారన్నారు. కేసీఆర్ కాలి గోటికి రేవంత్‌రెడ్డి సరిపోరని, పనిచేసే ప్రభుత్వ బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టంగట్టాలన్నారు. మూతపడ్డ భీంగల్ బస్‌డిపోను 14ఏళ్ల తర్వాత ప్రారభించుకున్నామని, ఆర్టీసీ ఇంజినీర్ల కష్టంతో రెండు నెలల్లోనే భీమ్‌గల్ బస్‌డిపోను పున:ప్రారంభించుకున్నామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ప్రస్తుతం భీమ్‌గల్ డిపోకు 22 బస్‌లను కేటాయించామని, భవిష్యత్తులో మరిన్ని కొత్త బస్సులను కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం అన్ని డిపోలు దాదాపు లాభాలబాటలో ఉన్నాయన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కేసీఆర్ దేవుడయ్యాడన్నారు. కేసీఆర్‌తో సాన్నిహిత్యంతో నిధులు తీసుకొచ్చి మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాల్కొండను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని బాజిరెడ్డి ప్రశంసించారు. ప్రతిపక్షాల మోసపూరిత మాటలను ప్రజలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


డిపోను ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

తొలి పూజకు వేళాయె

హిందూ సంప్రదాయంలో వినాయకుడికి విశిష్ట స్థానం ఉంది. తొలిపూజలందుకునేది ఆ గణనాయకుడే.. గణపతిని ఆరాధించిన తర్వాతే ఏ కార్యమైనా ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం వినాయక చవితి. ఈ నేపథ్యంలో వేడుకలకు ఊరూ వాడా ముస్తాబయ్యాయి. భక్తులు గణేశుడి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు మండపాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో ఆదివారం మార్కెట్లు సందడిగా కనిపించాయి. – కామారెడ్డి టౌన్



'పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి'


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రెరా చైర్మన్ సత్యనారాయణ

బీబీపేట: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఇందులో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని రెరా చైర్మన్ సత్యనారాయణ సూచించారు. ఆదివారం ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్ల అధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు తనకుతానుగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. విమర్శలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరు పండుగను కలిసి జరుపుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల వారికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్ల ఆధ్వర్యంలో 3 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. జబర్దస్త్ షో టీం సభ్యులు తమ స్కిట్‌లతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ సత్తయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జబర్దస్త్ టీం సభ్యులు గడ్డం నవీన్, అదుర్స్ ఆనంద్, హరిత, యాంకర్ అనూష, రిటైర్డ్ లెక్చరర్ రంజిత్ మోహన్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండపాలకు అనుమతి తప్పనిసరి

దోమకొండ: వినాయక మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై మురళి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి మండపం వారు తమ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలు పెట్టి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి టౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో ఎంపికైన విజేతలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 21న వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులు కీర్తన, కావ్య, మౌనిక, నందిని, అశ్విత, హరిత, వైష్ణవి, అఖిల, కారుణ్య, శ్రావంతి, వైష్ణవి, సంజన, హారిక, లావణ్య, శ్రీనిధి ఎంపికైయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు



ఎడపల్లి(బోధన్): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో రూ. కోటి వ్యయంతో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్రన్ తెలిపారు. ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్, గ్రంథాలయా ల భవన నిర్మాణాలకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సేవా కార్యక్రమాలు, వ్యక్తి చైతన్యంపై అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా అభయ ఫౌండేషన్ దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గ్రేవ్‌యార్డ్‌కు భూములు ఇవ్వం'



డిచ్‌పల్లి: నడిపల్లి శివారులోని విక్టోరియా హాస్పిటల్ కాంపౌండ్ భూములను గ్రేవ్‌యార్డ్ (శ్మశానం)కు ఇవ్వడానికి ఒప్పుకునేది లేదని సీఎంసీ చర్చి సభ్యులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుద్ధ స్థలాన్ని సంరక్షించాలని కోరుతూ కమిటీ సభ్యులు, క్రైస్తవులు ఆదివారం కాంపౌండ్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేవనగర్ సర్పంచ్ ఖతిజ యూసుఫ్, దేవపల్లి సర్పంచ్ ఆనందమ్మ మాట్లాడుతూ.. మెదక్ సీఎస్‌ఐ చర్చి డయాసిస్ ఆధీనంలో ఉన్న విక్టోరియా భూములను నిరుపయోగం చేయడానికి సమాధులకు ఇవ్వడానికి అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. నడిపల్లి, దేవనగర్, దేవుపల్లి మూడు గ్రామాల పరిధిలో ఉన్న ఈ స్థలంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిజామాబాద్ సీఎస్‌ఐ సంఘం వారికి స్థలం కేటాయిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాందేవ్, కమిటీ మెంబర్లు బండి ప్రసాద్, జోసఫ్, ఎస్ఎస్ ప్రభాకర్, ఎంసాల్మన్‌రాజ్, అంబుజ పద్మారావు, సంపూర్ణ సుధాకర్, డేనియల్, రవికుమార్, ఇందిరా జేమ్స్, వరునిక తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు గణనాథులు

వినాయక చవితి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని పలు ప్రాంతాలు జనంతో రద్దీగా మారాయి. గణేశుడి ప్రతిమలను యూత్ సభ్యులు తమ మండపాలకు వాహనాల్లో తరలించారు. నగరంలోని వీక్లీ బజార్, పెద్ద బజార్, కంఠేశ్వర్, బైపాస్ ప్రాంతాలు జనంతో కిక్కిరిసిపోవడంతో కొంత మేర ట్రాఫిక్ జామ్ అయింది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు



వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో పెడుతున్న యూత్ సభ్యులు



ఆటోలో వినాయక ప్రతిమను తీసుకెళ్తున్న భక్తులు





రామారెడ్డికి చేరిన భారీ విగ్రహాలు

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్‌లో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని వక్తలు అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, నగర మేయర్ దండు నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు రమేశ్, నర్సయ్య, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీలకు ఇందూరు అడ్డా..

- గన్‌కల్చర్ ప్రమాదంలో నిజామాబాద్
- అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా రౌడీలు, భూకబ్జాదారులకు అడ్డాగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్‌శాఖ విచ్చలవిడిగా గన్ లైసెన్సులు ఇస్తూ నగరాన్ని ప్రమాదంలో పడేసిందని, అసాంఘిక కార్యకలాపాలకు జిల్లా అడ్డాగా మారిందని అన్నారు. సీపీగా నాగరాజు పని చేసిన 18 నెలల్లో 70 తుపాకీ లైసెన్సులు ఇచ్చారని, వీటిని కేవలం భూకబ్జాదారులు, రియల్టర్లు, ఎమ్మెల్యే సన్నిహితులు, షాడో ఎమ్మెల్యేలు తీసుకున్నారని విమర్శించారు. హమాల్‌వాడీలో ఒకే ఇంటిపై ఆరు లైసెన్సులు పొందడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఒక్కో లైసెన్సుకు రూ.5లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు. నిజామాబాద్‌కు రూ. వందల కోట్లు ఖర్చు చేశామంటున్న అర్బన్ ఎమ్మెల్యే.. అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. పోలీసులు ఏకపక్షంగా పని చేస్తున్నారని, బైక్ ర్యాలీని అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వలేని నగరంలో గన్ లైసెన్సులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. శాంతిభద్రతలు కాపాడలేని అర్బన్ ఎమ్మెల్యే అసమర్థుడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, నాయకులు, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, నారాయణ యాదవ్, ఎర్రం సుధీర్, సుక్క మధు, పంచరెడ్డి శ్రీధర్, కిశోర్, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ

ఖలీల్‌వాడి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి పట్టణ సీఐ నరహరి అన్నారు. ఆదివారం పట్టణ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా, తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలన్నారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే నగరంలోని వినాయక మండప నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గణేశ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించే గణేశ్ మండలి వారు విధిగా పోలీస్ శాఖ రూపొందించిన https:// policeportal. tspolice. gov. in/ index. htm ఆన్‌లైన్ లింక్‌లో దరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల్లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సంజీవ్, ప్రవీణ్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకున్న సర్పంచ్



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ చంద్రశేఖర్

రుద్రూర్: జీపీ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లా ఉత్తమ జీపీగా రుద్రూర్ ఎంపికైంది. జిల్లా సమీకృత కార్యాలయంలో ఈ అవార్డును మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్‌కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీఆర్డీవో శ్రీచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లిలో శనివారం రాత్రి పేకాటస్థావరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారి నుంచి రూ.28,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్: రామారెడ్డి బైపాస్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని లక్కోరాకు చెందిన మహేందర్(40) స్వగ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించేవాడు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రెగ్యులరైజ్, బదిలీ ప్రక్రియలో సూర్యాపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆదివారం రామారెడ్డిలోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకోగా మహేందర్ మృతదేహంగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కెట్లో మొదలైన సందడి



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో వినాయక చవితి సందడి మొదలైంది. పట్టణంలోని సుభాష్‌రోడ్, తిలక్‌రోడ్, మాయాబజార్‌లో సోమవారం నిర్వహించే వినాయక చవితి ఏర్పాట్లకు కావాల్సిన సామగ్రితో ఆదివారం సందడిగా మారింది. ప్రజలు తమకు కావల్సిన పూజా సామగ్రి, వినాయకుల విగ్రహాలను కొనుగోలు చేశారు. పండుగ వాతావరణంతో వ్యాపారులు ధరలను పెంచారు. మట్టి విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి.





పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు



కలెక్టర్ చేతుల మీదుగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

- పదమూడేళ్లుగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ
- ఆదర్శం యువ యూత్ సభ్యులు

లింగంపేట: పర్యావరణ పరిరక్షణకు లింగంపేటకు చెందిన యువ యూత్‌సభ్యులు మట్టి గణపతులను 13 సంవత్సరాలుగా తయారు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. యూత్ సభ్యులు వినాయక చవితికి వారం రోజుల ముందు మట్టిని సేకరించి ప్రతీ సంవత్సరం 1500 మట్టి గణపతులను తయారు చేసి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందజేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన గణపతులతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని వాటిలో కలిపే కెమికల్స్‌తో చర్మ వ్యాధులు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించేలా ఇంటింటికి వెళ్లి మట్టి గణపతి అందజేసి వాటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. ప్రతి సంవత్సరం రూ. 20 వేలు ఖర్చు చేసి మట్టి గణపతులను తయారు చేస్తున్నట్లు యూత్ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. వీరి సేవలకు గతంలో కలెక్టర్లు సత్యనారాయణ, శరత్‌కుమార్, ప్రస్తుత కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రశంసాపత్రాలతో పాటు అవార్డులు అందజేసి సన్మానించారు. గతేడాది ఆగస్టు 15న గవర్నర్ సైతం ఉత్తమ సేవలకు ప్రశాంసాపత్రం, మెమొంటో అందజేశారు.



తండాల్లో బోనాల పండుగ

నాగిరెడ్డిపేట: మండలంలోని బెజుగం చెరువుతండా, మెల్లకుంటతండాల్లో ఆదివారం గిరిజనులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గిరిజన మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని తండాలలోని సేవాలాల్ మహరాజ్, జగదాంబమాత ఆలయాలకు చేరుకొని ప్రత్యేకపూజలు చేశారు. నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, తండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, సర్పంచ్ మంగ్లీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉత్సవాల్లో పాల్గొన్నారు.



బెజుగం చెరువు తండాలో పూజలు చేస్తున్న గిరిజనులు



మెల్లకుంట తండాలో బోనాలను ఎత్తుకొని ఆలయానికి చేరుకున్న గిరిజన మహిళలు

బెల్ట్ షాప్ సీజ్



మద్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కాస్‌బాగ్ తండాలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాప్‌పై పోలీసులు ఆదివారం దాడి చేశారు. రూ.30వేల మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. ఇంటి యజమాని బాదావత్ మోహన్, మద్యం విక్రయిస్తున్న రాజును పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్ట్ షాపులకు ఎక్కడా అనుమతులు లేవని, ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్సై దయాళ్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో మహేందర్, ఆనంద్ కుమార్, పండరి గౌడ్, నవీన్‌గుప్తా, సుధాకర్‌గౌడ్, చిప్ప మధు, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



సాయిలు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు ఓ రైతు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉబ్బు సాయిలు(48) శనివారంరాత్రి పొలం వద్ద బోరుమోటారు వేసేందుకు వెళ్లగా పంట రక్షణకు ఏర్పాటు చేసిన కంచె తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డెంగీతో బాలుడు ..



ఆద్యంత్ (ఫైల్)

కామారెడ్డి టౌన్: డెంగీతో 11 నెలల బాలుడు మృతి చెందిన ఘటన రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్వేశ్, సౌందర్యల 11 నెలల కుమారుడు ఆద్యంత్ వారం రోజులుగా తీవ్ర జ్వరం బాధపడుతున్నాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. శనివారం రక్తఫలికలు పడిపోవడం, డెంగీ ఉందని నిర్ధారించి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తమ బాబు బాగానే ఉన్నాడని చెప్పి వైద్యం అందించకుండా వైద్యులు నిర్లక్ష్యం చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆసుపత్రిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.